బడుగులు సలసల

నమస్తే తెలంగాణ
www.ntnews.com

బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

- ఆ తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- లేదంటే ప్రజాయుద్ధానికి బీసీలు సిద్ధంగా ఉన్నరు
- కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలి.. దానికోసం బీజేపీ పూనుకోవాలి
- బీఆర్ఎస్ సహా అన్ని పక్షాలు రాష్ట్ర సర్కారుపై ఒత్తిడి పెంచాలి
- జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య

(నూర శ్రీనివాస్/హైదరాబాద్, నమస్తే తెలంగాణ): బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 42% రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆ తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే తమ న్యాయమైన వాటా సాధన కోసం పోరాటాలు చేయడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌ను నిజం చేసేందుకు అవసమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగబద్ధంగా, న్యాయస్థానాల తీర్పులకు నిలబడి ఉండేలా బీసీలకు 42% రిజర్వేషన్లు ఎలా అమలు చేయవచ్చో జస్టిస్ ఈశ్వరయ్య సూచనలు చేశారు. కులగణన, బీసీ రిజర్వేషన్, స్థానిక సంస్థల ఎన్నికలు ఇలా అనేక అంశాలపై రాష్ట్రంలో ఆసక్తికరమైన, ఉత్కంఠ చర్చసాగుతున్న తరుణంలో సుదీర్ఘ కాలంగా బీసీ రిజర్వేషన్ల సాధన కోసం కృషి చేస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ప్రభుత్వం వెల్లడించిన కులగణనపై అభ్యంతరాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బీసీలు 42% రిజర్వేషన్లు సాధించుకోవడం సాధ్యమేనా?

జస్టిస్ ఈశ్వరయ్య: కులగణన విషయంలో వ్యక్తమవుతున్న అభ్యంతరాలు, అనుమానాలను పారదర్శకంగా నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఆ దిశగా ఏం చేస్తే సందేహాలు తీరుతాయో ఆ మార్గాలను ప్రభుత్వం అన్వేషించాలి. 42% రిజర్వేషన్లు సాధించుకోవడం బీసీల ముందున్న సవాల్. కామారెడ్డి డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. చిత్తశుద్ధిని చాటుకోవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం కల్పించిన చట్టాల ఆధారంగా రిజర్వేషన్లు సాధించుకోవచ్చు. తమిళనాడులో 1989 నుంచే 69% రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మండల్ కమిషన్ అనంతరం అప్పటివరకు లేని ఓబీసీ రిజర్వేషన్లు 27% జాతీయ స్థాయిలో 1993 నుంచి అనుభంలోకి రాలేదా?

ప్రజా ఒత్తిడికి తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం 42% రిజర్వేషన్లు పెంచుతూ ఒకవేళ చట్టం చేసినా అది న్యాయస్థానంలో నిలవని వాతావరణం ఉన్నదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అదెంతవరకు నిజం?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 నిబంధన (4) ప్రకారం, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కోసం ఏదైనా ప్రత్యేక ఏర్పాటు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నది. ఆర్టికల్ 15 నిబంధన (5) ప్రకారం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రగతి, వికాసాలకు రాష్ట్రప్రభుత్వం విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాటు చేసే అధికారం ఉన్నది. అధికరణ 30 నిబంధన (1) మైనారిటీ విద్యాసంస్థలు మినహా ప్రైవేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ విద్యాసంస్థలన్నింటి ప్రవేశాలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాటు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నది. ఆర్టికల్ 16(4) ప్రకారం, రాష్ట్రంలో ఏదైనా వెనుకబడిన తరగతికి రాష్ట్ర సర్వీస్ ప్రభుత్వ ఉద్యోగాల్లో తగినంత ప్రాతినిధ్యం లేదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే, ఆ వెనకబడిన తరగతి కోసం ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల ప్రత్యేక ఏర్పాటు చేసే అధికారమూ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డీ (6), 243 టీ (6) ప్రకారం, వెనుకబడిన తరగతి పౌరుల కోసం పంచాయతీల్లో, పంచాయతీ హోదాల్లో రిజర్వేషన్లు, మునిసిపాలిటీల్లో, మునిసిపాలిటీ హోదాల్లో రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్ర అసెంబ్లీకి ఉన్నది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ఏ (3) ప్రకారం, ప్రతి రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతం, చట్టం ద్వారా, తన సొంత ప్రయోజనాల కోసం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల జాబితా తయారుచేయవచ్చు, నిర్వహించవచ్చు. కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 343 ఏ (1)(2) కింద రూపొందించి, నిర్వహిస్తున్న సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల జాబితాకు భిన్నమైన ఎంట్రీలు రాష్ట్ర జాబితాలో ఉండవచ్చును. ఈ నేపథ్యంలో నేను మొదటి నుంచి చెప్తున్న సాంకేతిక, న్యాయపరమైన అంశాల ఛత్రంలో ఉండే విధంగా చట్టాన్ని చేయాల్సిన అవసరం ఉన్నది.

> **హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని ప్రభుత్వం అసెంబ్లీలో పేర్కొనడం వల్ల అవి మతపరమైన రిజర్వేషన్లుగా మారే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం ఒకవేళ ప్రభుత్వం చట్టం తెచ్చినా అది కోర్టులో నిలవదు అన్న వాదన ఉన్నది. దీనికి పరిష్కారం ఏమిటి?**
>
> **హిందూ** బీసీలు అంటే అందులో సిక్కు బీసీలు, బౌద్ధ బీసీలు, ముస్లిం బీసీలు అందరూ బీసీలే. అంటే విద్యాపరంగా, సామాజికంగా వెనుకబడిన తరగతులే. అవగాహనలేమితో మతాన్ని జోడించి చూస్తున్నారు కానీ, విద్య, సామాజికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఈ ప్రభుత్వం వేర్వేరుగా చూపినా ఓబీసీ జనాభా 56% ఉంటుంది. అట్లా చూసినప్పుడు బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడం అసాధ్యమేమీ కాదు. కోర్టు పరిధిలో నిలిచేలా చట్టం చేయాలి. ఆ జాగ్రత్తలు తీసుకోవాల్సింది ప్రభుత్వమే. ఆ మేరకు ఒత్తిడి తేవాల్సింది ప్రజాపోరాటాలే. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కుల సంఘాలు ఏకోన్ముఖమై చట్టపరిధిలో నిలిచేలా ప్రభుత్వంతో చట్టం చేయించుకునేలా న్యాయబద్ధంగా, తర్కానికిపోకుండా శాస్త్రీయంగా రిజర్వేషన్లు సాధించుకునేలా చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయాలి.

జనాభాలో సగానికి కన్నా ఎక్కువ ఉన్న బీసీలు 'మేమెంతో మాకంత' అనే నినాదంతో ఉద్యమిస్తున్న తరుణంలో బీసీలు 42 శాతానికే ఎందుకు పరిమితం కావాలి?

'మేమెంతో మా కంత' అనేది సహజ న్యాయం. ఇప్పటిదాకా ఉన్న బీసీ రిజర్వేషన్లు 27% ఉన్నాయి. వాటిని 42 శాతానికి పెంచుతామని కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అడుతున్నాం. 42% వాటా అన్నది అక్కడ పుట్టింది. ఈ నేపథ్యంలోనే దానిని నిలబెట్టుకోవాలని ప్రతిపాదిస్తున్నాం. 2011 జనాభా లెక్కలు, ఆయా ప్రభుత్వాలు రూపొందించిన చట్ట పరిధిలో సర్వే నిర్వహించిన సంస్థలు శాస్త్రీయంగా వెల్లడించిన జనాభా గణాంకాలను చూసినా, బీసీల పర్సంటేజ్ పరంగా చూసినా ఇప్పుడు బీసీలు కోరుతున్నది 42 శాతమే. రాజ్యాంగం ప్రసాదించిన సూత్రాలు, చట్ట పరిధిలో ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకొని తెలంగాణ బీసీ సమాజం ముక్తకంఠంతో 42% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నది.

> **ప్రస్తుతం బీసీలకు ఉన్న 29% రిజర్వేషన్లను 42% పెంపు కోసం మీరు ముసాయిదా రూపొందించారని చెప్తున్నారు. అది నిజమేనా? నిజమే అయితే దాని కూర్పును వివరిస్తారా?**
>
> ఆయా సందర్భాల్లో హైకోర్టులు, సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులు, జారీచేసిన మార్గదర్శకాలకు లోబడి ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ (కామారెడ్డి డిక్లరేషన్), ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని పరిగణనలోకి తీసుకొని ఒక ముసాయిదాను రూపొందించాం. దాని ప్రకారం ప్రస్తుతం బీసీల్లో ఉన్న ఐదు గ్రూపులకు (వాటిల్లోని కులాలకు) 29% రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. వాటిని 42 శాతానికి పెంచుతూ ముసాయిదా రూపొందించాం. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ జనాభా పెరిగిన నేపథ్యంలో వారి రిజర్వేషన్లు పెరగాలి. ఈ మేరకు ముసాయిదా రూపొందించాం. అది ఇలా ఉన్నది. ప్రస్తుతం బీసీ ఏ గ్రూప్ 7%, బీసీ-బీ 10%, బీసీ-సీ 1%, బీసీ-డీ 7%, బీసీ-ఇ 4% మొత్తంగా 29% బీసీ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మేము బీసీ-ఏకు 11%, బీసీ-బీ 15%, బీసీ-సీ 1%, బీసీడీ 11%, బీసీ-ఇ 4%, ఎస్సీల్కు 17.5%, ఎస్టీలకు 10% చొప్పున మొత్తం 69.5% రిజర్వేషన్లు ప్రతిపాదించాం.

ఈ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నది. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కు కనుక వారికి జనాభా ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు ఉన్నాయి. రాష్ట్రంలో వారి జనాభా దామాషాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెరగాలి. ఆ లెక్కన చూసినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పాపులేషన్ 85% నుంచి 90% ఉంటుంది. అయితే, ఇక్కడ మొత్తం జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు ఆ మేరకు రిజర్వేషన్లు కావాలని కోరడం లేదు. కోరుతున్నది 42శాతమే అన్న విషయం పరిగణనలోకి తీసుకోవాలి.

మీరు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు మొత్తం 69.5 శాతానికి ప్రతిపాదించారు. ఇది సాధ్యమేనా?

ఎందుకు సాధ్యం కాదు. ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా పెరిగింది కాబట్టి ఆ మేరకు పెరగాల్సిందే. అది ఆ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇందాక చెప్పినట్టు న్యాయస్థానాల తీర్పులు, రాజ్యాంగం వెనుకబడిన వర్గాలకు ప్రసాదించిన హక్కులు, వాగ్దానాలను అమలు చేయాలని కోరుతున్నాం. ఎలా ఎలా చేయవచ్చో చెప్తున్నాం. ప్రతిపాదిస్తున్నాం.

రాజ్యాంగం, న్యాయస్థానాల తీర్పులు మొత్తం రిజర్వేషన్లు 50% సీలింగ్ దాటొద్దని చెప్తున్న నేపథ్యంలో మీ ప్రతిపాదనల అమలు ఎలా సాధ్యం?

చట్టసభలకు ప్రజలు సర్వాధికారాలు ఇచ్చారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ఆ ప్రజాభీష్టం మేరకు ఏ చట్టాలు అయినా రూపొందించుకోవచ్చు. రాజ్యాంగంలో ఆర్టికల్ 31సీ ప్రకారం చట్టం చేస్తే, అటువంటి చట్టాలను 31బీ ప్రకారం (లోగడ కోర్టు తీర్పులకు విరుద్ధంగా ఉన్నా సరే) కొట్టివేయడానికి వీల్లేదు. ఇంద్రసహానీ కేసులో పేర్కొన్న తీర్పు అదే. రిజర్వేషన్ల పెంపు కోరుతూ చట్టం చేసి, అందుకు అనుగుణంగా రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలి. అందుకు అవసరమైన కార్యరంగాన్ని రూపొందించుకోవాలి. ఇదేం బ్రహ్మపదార్థం కాదు. 1989 నుంచి తమిళనాడులో అమలవుతున్నదే. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా చట్టం తేవాలి. రాజ్యాంగ సవరణకు కేంద్రానికి సిఫారసు చేసి ఊరుకుంటే సరిపోదు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలి. అవి మొక్కుబడిగా చేస్తే కుదరదు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రపతి చేత ఆమోదం వేయించాలి. ఇక్కడ కాంగ్రెస్, అక్కడ బీజేపీ ఈ రెండు పార్టీలు గట్టిగా పూనిక వహిస్తే ఈ రిజర్వేషన్ల సాధన పెద్ద విషయం కాదు. ఆ రెండు పార్టీలపై ఒత్తిడి తీసుకురావడానికి బీఆర్ఎస్, ప్రజాసంఘాలు, బీసీ సంఘాలు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి. ప్రజలూ ఆ మేరకు సహకరించాలి. ఈ ప్రక్రియ అంతా కావడానికి సంవత్సరాలు అక్కర్లేదు. అవన్నీ అయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. ఎవరు కలిసివస్తారు? ఎవరు కావాలని కాలయాపన చేస్తారు? బయటికి ఒకలా మాట్లాడాలి. లోపల ఒకలా ఎవరు ఉంటారు అన్నది తెలిసిపోతుంది. ఎవరైతే చిత్తశుద్ధితో, ఆత్మశుద్ధితో బీసీలకు సహకరించరో వారు బీసీలకు ద్రోహం చేస్తున్నట్టే లెక్క.

> **జస్టిస్ ఈశ్వరయ్య ప్రతిపాదిత ముసాయిదా చట్టం ఇలా..**
>
> *తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులకు చెంది పౌరులకు తెలంగాణ రాష్ట్ర విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు, తెలంగాణ రాష్ట్ర సర్వీసు ఉద్యోగాల నియామకాల్లో రిజర్వేషన్లు, అలాగే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల్లో పంచాయతీల్లో రిజర్వేషన్లు, మునిసిపాలిటీల చట్టం ప్రకారం మునిసిపాలిటీల్లో రిజర్వేషన్లు, మునిసిపల్ కార్పొరేషన్ల చట్టం ప్రకారం మునిసిపల్ కార్పొరేషన్లలో రిజర్వేషన్లు కల్పించే చట్టం 2025.*
>
> **చట్టం పేరు ప్రభావ పరిధి: ఇది మొత్తం తెలంగాణ రాష్ట్రానికి వర్తిస్తుంది.**
>
> *నిర్వచనం:* *వెనుకబడిన తరగతుల పౌరులు అంటే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన సముదాయం లేదా సముదాయాలు, రాష్ట్ర సర్వీసుల్లో తగినంత ప్రాతినిధ్యం లేని సముదాయాలు, స్థానిక సంస్థల్లో తగినంత ప్రాతినిధ్యం పొందని సముదాయాలు, అత్యంత వెనుకబడిన తరగతులు, డీ నోటిఫైడ్ సముదాయాలకు, వెనుకబడిన తరగతులకు మధ్య హేతుబద్ధ, న్యాయబద్ధ రిజర్వేషన్ ప్రయోజనాల పంపిణీ కోసం సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య వెనుకబాటుస్థాయి రీత్యా, వారికి రిజర్వేషన్ల కేటాయింపు ప్రతిపాదన. విద్యా సంస్థ అంటే, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే లేదా రాష్ట్ర నిధుల నుంచి ఆర్థిక సహాయం పొందే లేదా చట్టపరంగా స్థాపించబడిన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండే విశ్వవిద్యాలయ కళాశాల లేదా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల లేదా ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన లేదా ఆమోదించబడిన డిగ్రీ, డిప్లొమా లేదా ఇతర అకడమిక్ సర్టిఫికెట్లు ఇచ్చే శిక్షణా కేంద్రం లేదా సంస్థ ఏదైనా విశ్వవిద్యాలయం లేదా అధికారిక సంస్థ ద్వారా స్థాపించబడిన ప్రభుత్వ ఆమోదం పొందిన విద్యాలయం.*

బీసీల అనుమానమే నిజమైంది. సర్కారు మోసం బయటపడింది. ఏడాదిగా ఊరిస్తూ వచ్చిన సర్కారు.. బీసీలను నయవంచనకు గురిచేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్ హామీని అటుంచితే, కనీసం గత ఎన్నికల్లో ఇచ్చిన రిజర్వేషన్ల కంటే కూడా తక్కువ శాతమే ఇచ్చేందుకు సిద్ధమైనట్టు తేలింది. దీంతో తాము మోసపోయామని తెలుసుకున్న బీసీలు ఇక పోరాటమే శరణ్యమని నిర్ణయించుకున్నారు. మంగళవారమే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

బీసీ రిజర్వేషన్లలో కోత!

- ప్రస్తుతమున్న శాతం కన్నా తక్కువే
- సర్కారుకు డెడికేటెడ్ కమిషన్ నివేదిక
- సుప్రీం నిబంధనల మేరకు స్థిరీకరణ
- బీసీ నేతల్లో రగలిన ఆగ్రహజ్వాల
- నేడు బీసీల భవిష్యత్తు కార్యాచరణ: బీసీ సంఘం నేత జాజుల

హైదరాబాద్, ఫిబ్రవరి10 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను స్థిరీకరిస్తూ రూపొందించిన నివేదికను డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి అందజేశారు. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సోమవారం ఆ నివేదికను సమర్పించారు. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు విధించిన 50% సీలింగ్ మార్గదర్శకాలకు అనుగుణంగానే రిజర్వేషన్లను ఖరారు చేసినట్టు తెలుస్తున్నది. దీంతో బీసీల రిజర్వేషన్లు గతం కంటే తగ్గినట్టు విశ్వసనీయ సమాచారం. వాస్తవంగా స్థానిక సంస్థల్లో కేవలం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు ఉన్నాయి. బీసీలకు రాజ్యాంగపరమైన చట్టబద్ధత కలిగిన రిజర్వేషన్లు ఏమీ లేవు. ఇప్పటివరకు కేవలం ఆర్టికల్స్ 243-డీ(6), 243-టీ(6) ప్రకారమే ఇతమిద్దంగా, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం రిజర్వేషన్లను కలిస్తూ వస్తున్నాయి. ఇలా బీసీలు, ఎంబీసీ వర్గాలకు స్థానికసంస్థల్లో రిజర్వేషన్లను కల్పించడానికి ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, కమిషన్ సిఫారసులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు రిజర్వేషన్లను కల్పించవద్దని తేల్చిచెబుతూ ట్రిపుల్ టీ పేరిట సుప్రీంకోర్టు గతంలోనే మార్గదర్శకాలను జారీచేసింది. ఆ రిజర్వేషన్లు కూడా 50 శాతానికి మించకూడదనే షరతును కూడా విధించింది. ఆ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బూసాని వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ తాజాగా బీసీ రిజర్వేషన్లను స్థిరీకరిస్తూ ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఈ నివేదికపై త్వరలోనే క్యాబినెట్‌లో చర్చించి ఆమోదించే అవకాశం ఉన్నదని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. బీసీల రిజర్వేషన్లలో గతం కంటే కోత పడిందని విశ్వసనీయ సమాచారం. 2019 ఎన్నికల్లో సర్పంచ్ స్థానాల్లో బీసీలకు 22.78% రిజర్వేషన్‌ను అమలుచేశారు. ప్రస్తుతం అదే బీసీలకు 21% కంటే తక్కువకే ఆ పదవులు పరిమితం అవుతాయని విశ్వసనీయ సమాచారం. పదవుల రిజర్వేషన్ల శాతాల్లోనూ కోత పడిందని తెలుస్తున్నది.

సర్కారుపై బీసీ సంఘాల ఆగ్రహం



స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్ సర్కారు వైఖరిపై బీసీ సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా కులగణన చేసి, 42% రిజర్వేషన్లను కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ మేరకు డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పిస్తుందని సంఘాల నేతలు ఆశించారు. కానీ ప్రభుత్వం ఇప్పటికే 42% రిజర్వేషన్ కల్పన సాధ్యంకాదని, పార్టీ పరంగానే సీట్లను కేటాయిస్తామని ప్రకటించడంతోనే బీసీ సంఘాల నేతల్లో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. తాజాగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఎత్తిచూపుతూ ఆ మేరకే రిజర్వేషన్లను ఖరారు చేయడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నారు. దీంతో ప్రభుత్వంపై పోరుకు సమాయత్తం అవుతున్నారు. ఈ మేరకు మంగళవారం భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



2019లో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల శాతం				
పదవి	ఎస్సీ	ఎస్టీ	బీసీ	ఇతరులు
సర్పంచ్	20.53	6.68	22.78	50
మండల పరిషత్	19.43	11.85	18.77	50
జిల్లా పరిషత్	19.03	13.86	17.11	50

2019లో 123 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల శాతం				
పదవి	ఎస్సీ	ఎస్టీ	బీసీ	ఇతరులు
మున్సిపల్ చైర్మన్	13.82	3.25	32.52	50.41

'డెడికేటెడ్' నివేదికపై గోప్యమెందుకు?

వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): డెడికేటెడ్ కమిషన్ నివేదికను గోప్యంగా ప్రభుత్వానికి అందించడంపై బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ సంఘాల ప్రతినిధులు, మేధావులు వెలువరించిన అంశాలను పరిష్కరించిన తర్వాతే కమిషన్ నివేదికను తీసుకుంటామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ దానిని నిలబెట్టుకోకపోవడమంటే బీసీలను నమ్మించి నట్టేట ముంచడమేనని పేర్కొన్నారు. కులగణనలో బీసీల జనాభా తగ్గించారని మరోసారి స్పష్టం చేశారని విమర్శించారు. కులాలవారీగా వివరాలన్నీ బహిర్గతం చేయాలనే డిమాండ్‌ను సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి పరిష్కరిస్తామన్న మంత్రి హామీ ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. ఈ మాత్రం దానికి ప్రత్యేక సమావేశం ఎందుకు నిర్వహించారని మండిపడ్డారు. నాటి సమావేశంలో తిరిగి కుల సర్వే చేస్తామని చెప్పగా, ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా కమిషన్ నివేదిక తెప్పించుకోవడం బీసీలకు ద్రోహం చేయడమేనని పేర్కొన్నారు.

42% వాటా వచ్చే వరకు తగ్గేదే లేదు

- పోరాటాల ఖిల్లా జగిత్యాల నుంచే మహోద్యమం ఆరంభం
- 31 సార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి బీసీ నేతలతో ఎందుకు సమావేశం కావడం లేదు
- మేడిగడ్డ లింక్-1 ఎత్తిపోతలను ఉపయోగంలోకి తేవాలి
- జగిత్యాల అసెంబ్లీ ఉపఎన్నిక వస్తే కాంగ్రెస్ పార్టీకి అడ్రస్సుండదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- బీఆర్ఎస్ పార్టీ జగిత్యాల నియోజకవర్గ కార్యకర్తలతో భేటీ

జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఎల్ రమణ, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తదితరులు

జగిత్యాల, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడానికి వెంటనే బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చే వరకు తగ్గేదే లేదని, తమ ఉద్యమం ఆగదని స్పష్టంచేశారు. పోరాటాల ఖిల్లా జగిత్యాల నుంచే బీసీల మహోద్యమం ఆరంభమవుతుందని, మరో తెలంగాణ ఉద్యమం తరహా పోరాటానికి బీసీలంతా సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. కులగణన లెక్కలపై బీసీ సామాజిక వర్గంలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో బీసీ కుల సంఘాలతో ముఖ్యమంత్రి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆమె జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. అబద్ధపు మాటలు చెప్పి బీసీల ఓట్లు వేయించుకొని బురిడీ కొట్టించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ గణన విషయంలో పక్కా మోసానికి పాల్పడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో బీసీ జనాభా 52% ఉన్నట్టు 2014లోనే కేసీఆర్ లెక్క తేల్చారని, బీసీ గణన చేయడం కూడా రాని రేవంత్‌రెడ్డి సర్కారు తప్పుడు లెక్కలు చెప్తున్నదని మండిపడ్డారు. కావాలనే బీసీ జనాభాను తక్కువ చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెప్పిన తప్పుడు లెక్కలను రాహుల్‌గాంధీ పార్లమెంటులో ప్రస్తావిస్తూ సభను తప్పుదోవపట్టిస్తున్నారని విమర్శించారు. బీసీ ఓటర్లు 46% మాత్రమే ఉన్నారని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ వర్గాల్లో ఏ కులంలో ఎంత జనాభా ఉన్నారనే లెక్కలు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.

> కేసీఆర్ పాలన ఐఫోన్ లా ఉంటే.. రేవంత్‌రెడ్డి పాలన చైనా ఫోన్‌లా ఉన్నది. ఐఫోన్‌కు, చైనా ఫోన్‌కు ఎంత తేడా ఉంటుందో.. కేసీఆర్ పనితీరుకు, రేవంత్‌రెడ్డి పనితీరుకు అంత తేడా ఉన్నది. చైనా ఫోన్ చూడటానికి బాగున్నా సరిగ్గా పనిచేయదు. సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు హామీలు చెప్పి అధికారంలోకి వచ్చారు. ఏ ఒక్కటీ నెరవేర్చడం లేదు. -ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఎండిన పొలాలను చూస్తుంటే కన్నీళ్లొస్తున్నాయి

కాంగ్రెస్ పాలనలో ఎండిపోయిన పొలాలను చూపిస్తూ రైతులు బాధపడుతున్నారని ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తంచేశారు. బీర్‌పూర్ మండలం మంగెళ గ్రామానికి చెందిన రైతు ఎండిన పొలాలను చూపుతూ, సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు చూస్తుంటే కన్నీళ్లు వచ్చాయని చెప్పారు. కేసీఆర్‌పై అక్కసుతోనే మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగించడం లేదని విమర్శించారు. కాళేశ్వరం లింక్-1 ద్వారా ఎత్తిపోతలు నిలిపివేయడంతో వరద కాలువలో నీళ్లు లేని దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. జగిత్యాల, చొప్పదండి, పెద్దపల్లి ప్రాంతాల రైతులు అల్లాడిపోతున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కక్షలు, కార్పణ్యాలు పక్కనపెట్టి, రైతుల సంక్షేమం కోసం లింక్-1ను వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

వచ్చేది బీఆర్ఎస్ 3.0 సర్కారే

జగిత్యాలకు వచ్చిన ఆమె సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జగిత్యాలలోనే మకాం వేశారు. జగిత్యాల నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాలు, పట్టణాలకు చెందిన కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. 'ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. వచ్చే రోజులన్నీ బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉంటాయి. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ 3.0 ప్రభుత్వం వస్తుంది' అని పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేశారని, ఉప ఎన్నిక ఏ సమయంలో వచ్చినా, జగిత్యాలలో కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోతుందని చెప్పారు. సమావేశంలో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తుల రాజేందర్‌రావు, ఓరుగంటి రమణారావు, గట్టు సతీశ్, దావ సురేశ్, శీలం ప్రియాంక ప్రవీణ్ పాల్గొన్నారు.

> **సీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఏడాదిలో 31 సార్లు ఢిల్లీకి పోయిన రేవంత్‌రెడ్డి.. బీసీ సంఘాల ప్రతినిధులు, నాయకులతో ఎందుకు సమావేశమవ్వడం లేదు. బీసీ ఉద్యమ నేతలతో సీఎం మాట్లాడకపోవడం బీసీలను అవమానించడమే.**
> -ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

మున్నూరుకాపుల పోరుబాట

- 17న అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన ప్రదర్శనలు
- 23న ఎమ్మెల్యేల ఇండ్ల ఎదుట ఆందోళన కార్యక్రమాలు
- మున్నూరుకాపు సంఘం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కొండా దేవయ్య పటేల్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 10: కులగణన సర్వే తప్పుల తడకపై మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పోరుబాటకు సిద్ధంకావాలని సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఈ నెల 17న కలెక్టరేట్ల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించి, వినతిపత్రాలు ఇవ్వాలని, 23న ఎమ్మెల్యేల ఇండ్ల ఎదుట నిరసనలు చేపట్టాలని తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పలువురు వక్తలు పాల్గొని కులగణన సర్వే తప్పులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వేపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మౌనం వీడాలని వారు డిమాండ్‌చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ మాట్లాడుతూ 2014లో 27 లక్షలుగా ఉన్న మున్నూరుకాపులు 2024 వచ్చేసరికి 13 లక్షలే ఉన్నట్టు ప్రభుత్వం కులగణన నివేదికలో పొందుపర్చినట్టు చెప్పిందని, ఆ లెక్కలు శుద్ధ తప్పులేనని విమర్శించారు. ప్రస్తుతం మున్నూరుకాపుల సంఖ్య 40 లక్షలకు పైగా ఉంటుందని, ప్రభుత్వ తప్పుడు లెక్కలను నిరసిస్తూ ఈ నెల 17, 23 తేదీల్లో జరిగే నిరసనల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ విఠల్ మాట్లాడుతూ ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ దేశమంతా బీసీల సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నారని, కానీ, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఆయన నోటి ద్వారా వచ్చిన బీసీల సమగ్ర కులగణన తప్పుల తడకగా మారితే ఎందుకు స్పందించడం లేదని విమర్శించారు.

బీసీలకు కాంగ్రెస్ నయవంచన

- ఈడబ్ల్యూఎస్ కోసం బీసీ జనాభా తగ్గింపు
- సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం



హైదరాబాద్, ఫిబ్రవరి10 (నమస్తే తెలంగాణ): రాజకీయంగా అణచివేసేందుకే బీసీల గణాంకాలను తారుమారు చేసి నయవంచనకు గురిచేసిందని సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామిగౌడ్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఇంటింటి సర్వేను తప్పుల తడకగా నిర్వహించిందని ధ్వజమెత్తారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కాపాడేందుకే బీసీలను బలిపశువులను చేస్తున్నదని మండిపడ్డారు. సమగ్ర కులగణనలో బీసీలు కేవలం 46.25 శాతమే ఉన్నట్టు చూపడం దగా చేయడమేనని పేర్కొన్నారు. జాతీయ నివేదికలు బీసీల జనాభా 52 శాతానికి పైగా ఉన్నట్టు రుజువు చేశాయని తెలిపారు. రాష్ట్ర జనాభా వాస్తవికంగా 4 కోట్లకు పైగా ఉండగా, సర్వేలో 3.70 కోట్లే ఉన్నట్టు ప్రభుత్వం తేల్చడం అన్యాయమని విమర్శించారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లోనే గౌడ జనాభా దాదాపు 5 లక్షల వరకు ఉంటుందని తేల్చిచెప్పారు. ఇప్పటికైనా సర్వే తప్పులను సవరించాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని వీరస్వామిగౌడ్ స్పష్టంచేశారు.